ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 20 జూలై 2025

ప్లాస్టిక్‌తో మానవాళికి ముప్పు

కలెక్టర్ టీఎస్ చేతన్



కాలేజ్ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో అవసరమని కలెక్టర్ చేతన్ పిలుపు నిచ్చారు. పట్టణంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలనపై భారీ ర్యాలీని నిర్వహించారు. దీన్ని కలెక్టర్ ప్రారంభించి విద్యార్థులు, అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని మానేసి జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులు మొదలు పెద్ద షాపులు, సూపర్ మార్కెట్లు, ఇతర వ్యాపారులు ప్లాస్టిక్‌కు బదులు జూట్, క్లాత్ బ్యాగులను వినియోగదారులకు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు ప్లాస్టిక్ నిర్మూలన, జూట్‌బ్యాగుల వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులు పుల్లన్న, కాటమయ్యలను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేశ్, వీఆర్వో రవిశేఖర్‌రెడ్డి, మున్సిపాలిటీ టీపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టీపీఎస్ అలివేళమ్మ, ఆర్ఐలు రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు సందర్శన

స్థానిక గాంధీనగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో మున్సిపల్, బటర్‌ఫ్లై పార్కులను కలెక్టర్ పరిశీలించారు. పార్కుల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చేవిధంగా తీర్చిదిద్దాలన్నారు.

కోట్ల భూమికి లక్షల పరిహారమా..?

342వ జాతీయ రహదారికి భూసేకరణ

16 ఎకరాలు కోల్పోయిన 20మంది రైతులు

బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్

ముదిగుబ్బ, జూలై 19(ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం విషయంలో ఏర్పడిన చిక్కుముడి వీడకుండా ఉంది. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమకు న్యాయమైన పరిహారం అందించాలని భూములు కోల్పోయిన రైతులు కోరుతున్నారు. అయితే పరిహారం పెంపు తమ చేతుల్లో లేదని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. మే 28 నుంచి బైపాస్ నిర్మాణ పనులు అడ్డుకుని, రైతులు ధర్నాలు కొనసాగించారు. సంబంధిత అధికారులు రైతులకు నచ్చచెప్పడంతో పనులు మళ్లీ మొదలయ్యాయి. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి, అక్కడి నుంచి కోడూరు వరకు 342వ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా ముదిగుబ్బలో 1.6 కి.మీల బైపాస్ నిర్మాణానికి 20 మంది రైతుల నుంచి 16 ఎకరాల భూమిని సేకరించారు. దొరిగల్లు పరిధిలోని భూములకు ఎకరానికి రూ.7.5 లక్షలు, గుంజేపల్లి పరిధిలో ఎకరానికి రూ.12 లక్షలు పరిహారం ఇస్తామని అధికారులు చెప్పడంతో ఇందుకు రైతులు ససేమిరా అంటున్నారు. మార్కెట్‌లో ఎకరం భూమి రూ.కోటి పైనే పలుకుతోందని, ఎకరానికి రూ. 1.20 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



జూనియర్ కళాశాల సమీపంలో జరుగుతున్న బైపాస్ పనులు

సమస్య కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి...

పరిహారం విషయాన్ని స్థానిక తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. వారికి భూములు కోల్పోతున్న రైతు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అయినా నేటి వరకు పరిహారం పెంపుపై ఎలాంటి స్పష్టత రాలేదు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ముదిగుబ్బ శివారులో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు దారి లేకుండా పోతోంది. కళాశాల ముందు భాగంలో 30 అడుగుల లోతు వరకు తవ్వి బైపాస్ నిర్మిస్తున్నారు. దీంతో కి.మీ దూరం చుట్టేసుకొని మండల కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

● **స్పష్టత లేదు**



342వ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం పెంచాలని, కలెక్టర్, రాష్ట్ర, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఇంతవరకు ఎలాంటి స్పష్టతా రాలేదు. కోట్లు విలువ చేసే భూములకు, లక్షల్లో పరిహారం అందిస్తామంటున్నారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి.

-సోమల ప్రకాష్,
రాష్ట్ర అగ్రికల్చర్ రీసెర్చ్ కోకన్వీనర్, ముదిగుబ్బ

● **విలువైన భూములు కోల్పోతున్నాం**



బైపాస్ పనుల వల్ల గుంజేపల్లి రెవెన్యూ పొలంలో ఎకరం భూమిని కోల్పోతున్నాం. పరిహారం లక్షల్లో ఇస్తామని అధికారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి.

- బాల రాము, రైతు, ముదిగుబ్బ

● **న్యాయం చేస్తాం**

బైపాస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నిబంధనల ప్రకారమే పరిహారం వస్తుంది. పరిహారం పెంపుపై ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లాం. రైతులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తాం.

- నారాయణస్వామి, తహసీల్దార్, ముదిగుబ్బ

కియ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి



దుద్దేబండ క్రాస్‌వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కియ, దాని అనుబంధ పరిశ్రమల కోసం జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు ప్రారంభం అయ్యాయి. మండలంలోని దుద్దేబండ క్రాస్ వద్ద శనివారం ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు ఎన్‌హెచ్ ఆర్‌ఓ రాకేష్ కుమార్‌సింగ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ తరుణ్‌కుమార్, మేనేజర్ తదితరులు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం చేపడతామని వారు తెలిపారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల దాడి

7

బడికి పొగ..!

కట్టెలతో మధ్యాహ్న భోజనం తయారీ

● పొగచూరుతున్న తరగతి గదులు

● విద్యార్థులు, టీచర్ల ఉక్కిరిబిక్కిరి



బాలికల ఉన్నత పాఠశాలలో ఆరుబయట కట్టెలతో వంటచేస్తున్న దృశ్యం

కదిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తుండటంతో తరగతి గదులు పొగచూరుతున్నాయి. శ్రద్ధగా పాఠాలు వినే విద్యార్థులు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే వండి ఆహార పదార్థాలు కూడా పొగ వాసన వస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. గ్యాస్ స్టౌ మీద వంట చేస్తే తమకు గిట్టుబాటు కావడం లేదన్న నెపంతో కొన్ని మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు కట్టెల మీద వంట వండుతున్నట్లు చెబుతున్నారు. చాలా మండలాల్లో ఎక్కువ శాతం హైస్కూళ్లలో కట్టెల మీదే వంట చేస్తున్నారు. దీన్ని ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులుకానీ, ఉపాధ్యాయులు గానీ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

పాఠశాలను కమ్మేస్తున్న పొగ

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఇంకా కట్టెలమీదే వంట చేస్తున్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఒకటి, జూనియర్ కళాశాలలో ఒక మధ్యాహ్న భోజన ఏజెన్సీ ఉన్నాయి. ఈరెండింటికి కలిపి (మిగతా 7వ పేజీలో..)

ఒక్కో రోజు ఒక్కోలా



ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తోంది. అయితే పాతబియ్యం పాఠశాలలో 50 బస్తాలు ఉన్నాయి. వీటిని ఖర్చు చేయమని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. అందుకే ఒకరోజు సన్నబియ్యం, మరోరోజు లావు బియ్యంతో వంట తయారు చేయిస్తున్నాం. లావుబియ్యంతో వంట చేసిన రోజు కట్టెలు వాడుతున్నారు.

- లియాకత్, హెచ్ఎం, బాలుర ఉన్నతపాఠశాల, కదిరి

లైన్ క్లియర్..!

● వేగంగా హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు

● పరుగులు పెట్టనున్న కృష్ణా జలాలు

● నెలాఖరుకు అనుకున్న లక్ష్యం పూర్తి

పుట్టపర్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఈ ఏడాది హంద్రీనీవా కాలువల్లో జోరుగా పరుగులు పెట్టనుంది. ఆధునికీకరణలో భాగంగా కాలువకు లైనింగ్ పనులు జరగడమే ఇందుకు కారణం. దీంతో ఈ ఏడాది ఎప్పటికంటే ముందుగానే ఉమ్మడి జిల్లాకు కృష్ణా జలాలు రానున్నాయి. నంద్యాల జిల్లా మల్యాల పంప్‌హౌస్ వద్ద సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువకు గురువారం నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో రెండో విడత కింద కాలువ ఆధునికీకరణ లైనింగ్ పనుల్లో వేగం పెరిగింది. జీడిపల్లి రిజర్వాయర్ నిండేలోపే పుంగనూరు ప్రధాన కాలువ లైనింగ్ పూర్తి చేయాలన్న లక్ష్యంతో రాత్రింబవళ్లు పని చేస్తున్నారు.

నెలాఖారుకు పూర్తి చేయడమే లక్ష్యంగా..

జీడిపల్లి జలాశయం నుంచి పుంగనూరు హంద్రీనీవా కాలువకు వెయ్యి క్యూసెక్కులకు మించి వెళ్లకపోవడంతో 2520 క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం కొనసాగేలా లైనింగ్ పనులు చేపట్టారు. వంద రోజుల్లో పూర్తయ్యేలా ఒకేసారి అన్ని ప్యాకేజీల్లో రూ.936.70 కోట్ల అంచనాలతో లైనింగ్ పనులు ప్రారంభించారు. జీడిపల్లి జలాశయం ప్రధాన కాలువ 216 కి.మీ నుంచి 400 కి.మీ దాకా మొత్తం 184.2 కి.మీ మేర పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) లైనింగ్ పనులు చేపట్టారు. వీటిని జూన్ 10 నాటికే పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే కొన్ని అవాంతరాలు ఎదురుకావడంతో పనుల్లో జాప్యం జరిగింది. అయినా ఇబ్బందులను అధిగమించి రాత్రింబవళ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజక వర్గాల ప్రాంతాల్లో ఈప్రధాన కాలువ లైనింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈనెల 10న జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టపర్తి- కొత్తచెరువు ప్రధాన రహదారి రైల్వేస్టేషన్ సమీపంలోని హంద్రీనీవా లైనింగ్ పనులు పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఐదు ప్యాకేజీల కింద చేపట్టిన లైనింగ్ పనులు ఇప్పటిదాకా 68 శాతంపైగా పూర్తి అయినట్లు తెలుస్తోంది. జీడిపల్లి జలాశయం నుంచి కాలువకు ఇరువైపులా పలుచోట్ల లైనింగ్ కాలువ మధ్యలో బెడ్డింగ్ వేయాల్సి ఉంది. జీడిపల్లి వైపు కృష్ణజాలాలు పరుగులు పెడుతున్న నేపథ్యంలో ఈనెలాఖరుకు మిగిలిన ఆధునికీకరణ పనులు అన్నీ పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.



పుట్టపర్తి వద్ద లైనింగ్ పూర్తయిన హంద్రీనీవా కాలువ

68శాతం పూర్తి: రాజాస్వరూప్‌కుమార్, ఎస్ఈ, హంద్రీనీవా

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. ఇప్పటికే 68 శాతం పూర్తి చేశాం. ఈనెలాఖారుకు పనులు పూర్తయ్యేలా వేగం పెంచాం. జీడిపల్లి నుంచి కాలువలోకి నీరు వదిలేలోపు లక్ష్యాన్ని చేరుకుంటామనే ధీమాతో ఉన్నాం.



కాలువలో లైనింగ్ పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

రాయలసీమ భగీరథుడు చంద్రబాబు

- మంత్రి సవిత



కరపత్రం అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, మాజీ మంత్రి

నల్లమాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పాలిట అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని బీసీ సంక్షేమ, చేనేతజౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంలో రూ.3,857 కోట్లతో హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను ఈ ప్రాంతానికి తీసుకు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అపర భగీరథ ప్రయత్నం చేశారన్నారు. డ్రోన్లు, ఏఐ తదితర ఆధునిక టెక్నాలజీ తీసుకొచ్చి, వ్యవసాయ ఖర్చులను తగ్గించి, రైతుకు ఆదాయం చేకూర్చారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి సాగు, తాగునీరు అందించకుండా వైసీపీ రంగులు మాత్రం వేశారంటూ ఎద్దేవా చేశారు. ప్రజలకు, రాష్ట్రానికి ఉపయోగపడే పనులు ఒక్కటీ చేయలేదన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలని చూశారంటూ ధ్వజమెత్తారు. దానిని రద్దు చేసింది చంద్రబాబునాయుడు అని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 193 చెరువులు, రెండు రిజర్వాయర్లను కృష్ణాజలాలతో నింపి, ఈప్రాంతాన్ని మరో కోస్తాంధ్రగా మారుస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి సుపరిపాలనపై ప్రజలకు వివరించారు. ఆ తరువాత రాగానిపల్లి సమీపాన వ్యవసాయ గోడౌన్ వద్ద రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాల్గొన్నారు. రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు తయారుచేసిన వస్తువులు, స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ లక్ష్మానాయక్, రెడ్స్ ప్రతినిధి భానుజా, టీడీపీ నాయకులు సామకోటి ఆదినారాయణ, వల్లెపు సోమశేఖర్, కన్వీనర్ మైలే శివశంకర్, సర్పంచ్ భారతి, సింగిల్‌విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, ఎల్‌బీసీ నరసింహులు, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో రూ.2.35 లక్షలు మాయం

ఖాతాల నుంచి డబ్బులు పోయాయంటూ పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాగభూషణ

కొత్తచెరువు, జూలై19(ఆంధ్రజ్యోతి): తమ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బు కాజేశారని మండలంలోని కదిరేపల్లికి చెందిన నాగభూషణ శనివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ మారుతీశంకర్ తెలిపారు. సీఐ తెలిపిన మేరకు కదిరేపల్లికి చెందిన నాగభూషణ తన బ్యాంకు అకౌంట్‌కు, భార్య గాయత్రీ బ్యాంక్ అకౌంట్‌కు ఒకే ఫోన్ నంబర్‌నే వాడుతున్నాడు. ఫోన్‌పేకు కూడా ఆ నెంబర్‌నే వాడుకుంటు న్నాడు. ఈ నెల ఏడో తేదీ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ నుంచి నాగభూషణ ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. దాన్ని క్లిక్ చేశాడు. దీంతో ఫోన్ హ్యాక్ అయ్యి అప్పటి నుంచి ఫోన్ పే పని చేయకుండా పోయింది. వారం తరువాత బ్యాంకుకు వెళ్లి తనిఖీ చేసుకోగా దంపతుల ఇద్దరి అకౌంట్ల నుంచి రూ.2,35,002లు మాయమైంది. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్యాన్సర్ యూనిట్ బాగయ్యేనా..!

వైసీపీ హయాంలో నిర్వహణ గాలికి..

నాలుగేళ్లుగా ఆగిపోయిన రేడియో థెరపీ సేవలు

బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు



ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాన్సర్ యూనిట్

అనంతపురం వైద్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాన్సర్ యూనిట్‌ను బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆగిపోయిన రేడియో థెరపీ సేవలను పునః ప్రారంభించేందుకు రూ.2 కోట్లు వెచ్చించి కోబాల్ట్ సోర్స్‌ను తెప్పిస్తోంది. దీంతోపాటు నూతన భవనాన్ని నిర్మించి, మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అనుబంధంగా శారదానగర్‌లో క్యాన్సర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అత్యంత ఖరీదైన క్యాన్సర్ వైద్య సేవలను 2014లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. క్యాన్సర్ యూనిట్‌లో ఓపీ, కీమో, రేడియో థెరపీ సేవలు అందించేవారు. అడ్మిషన్ మాత్రం సర్వజన వైద్యశాలలో చేసుకుంటారు. టెలీకోబాల్ట్ యంత్రంలో కోబాల్ట్ సోర్స్ అయిపోవడంతో నాలుగేళ్లుగా రేడియో థెరపీ సేవలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం క్యాన్సర్ యూనిట్ నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో క్యాన్సర్ బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి రూ.లక్షల్లో ఖర్చు పెట్టుకుంటున్నారు.

మూలన చేరిన యంత్రం

రేడియో థెరపీకి రేడియోధార్మిక ఐసోటోప్ కలిగిన కోబాల్ట్ యంత్రాన్ని ఉపయోగిస్తారు. కోబాల్ట్ సోర్స్ నుంచి వెలువడే గామా కిరణాల ద్వారా క్యాన్సర్ కణాలను నశింపజేస్తారు. చర్మం, నాలుక, స్వరపేటిక, మెదడు, రొమ్ము, గర్భాశయం తదితర క్యాన్సర్ బాధితులకు రేడియో థెరపీ చేస్తారు. క్యాన్సర్ యూనిట్‌లోని రేడియో థెరపీ యంత్రంలో కోబాల్ట్ సోర్స్, సోర్స్ హెడ్, సోర్స్ డ్రాయర్, కొలిమీటర్, గాంట్రీ, కంట్రోలర్, కంట్రోల్ కన్సోల్ తదితరాలను సర్వీస్ చేయాల్సి ఉంటుంది. పదేళ్ల పాటు పనిచేసేయాల్సిన ఈ యంత్రం ఏడేళ్లకే మరమ్మతులకు వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో యంత్రాన్ని వృధాగా వదిలేశారు. కీమో థెరపీ మాత్రం కొనసాగుతోంది.

రూ.కోట్ల ఖర్చుతో..

క్యాన్సర్ యూనిట్‌లో రేడియో థెరపీ చికిత్స ప్రక్రియను 2009లో మొదలుపెట్టి.. 2014లో అందుబాటులోకి తెచ్చారు. ప్రతి వంద మంది క్యాన్సర్ బాధితుల్లో 50 మందికి రేడియో థెరపీ చేయాల్సి వస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. కోబాల్ట్ సోర్స్ అయిపోవడంతో 2021 నుంచి సేవలను నిలిపివేశారు. కోబాల్ట్ సోర్స్‌ను కొనుగోలు చేయడం ఖరీదైన వ్యవహారమే కాదు.. కఠిన

(మిగతా 7లో...)

హోంమంత్రి పర్యటనను జయప్రదం చేయండి

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మడకశిర పర్యటనను జయప్రదం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. ఈనెల 21న ఆమె పర్యటనకు వస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా హోంమంత్రి పర్యటించే ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం రాత్రి 9గంటలకు మడకశిరకు రానున్నట్లు తెలిపారు. 21న ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొంటారన్నారు. 10.30గంటలకు ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమ పరిశీలిస్తారన్నారు. అనంతరం గుడిబండలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మడకశిరకు వచ్చి, భోజనానంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. సాయంత్రం 4.45గంటలకు పట్టణంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద జరిగే బహిరంగ సమావేశంలో మాట్లాడతారని తెలి పారు. 7గంటలకు మడకశిర నియోజకవర్గంలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. రాత్రి 9గంటలకు మడకశిర నుంచి బయలుదేరి బెంగళూరుకు, అక్కడి నుంచి విజయవాడకు వెళ్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, సీఐలు నాగేష్‌బాబు, రాజకుమార్‌లు, తదితరులు ఉన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

22 వరకు డైట్ సెట్ కౌన్సెలింగ్

సెంట్రల్ యూనివర్సిటీలో ప్రవేశాలు

7

క్రైం కార్నర్

కౌలు రైతు ఆత్మహత్య

పామిడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కౌలు రైతు ఆదెన్న(70) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నా డు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదెన్న, భార్య నాగమ్మ తోటను కౌలుకు తీసుకుని, పూలు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆదెన్న టీబీ, షుగర్‌తో బాధపడుతుండేవాడు. షుగర్ వల్ల టీబీ నయం కాకపోవడంతో కడుపునొప్పి వచ్చేదన్నారు. కడుపునొప్పి తాళలేక చైతన్య కాలనీ సమీపాన ఖాళీ ప్రదేశంలో పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లినవారు గమనించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని, ఆదెన్నను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఆదెన్నకు నలుగురు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ..


జ్యోతి (ఫైల్)

బ్రహ్మసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన కురువ జ్యోతి (38) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. ఈమె గత ఆరేడు సంవత్సరాల నుంచి కడుపునొప్పితో బాధపడేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో భర్త వన్నూరుస్వామి బొలెరో డ్రైవర్‌గా పని చేసి సంపాదించిన సొమ్మంతా తన వైద్యానికే సరిపోతోందని, ముగ్గురు కుమార్తెలను ఎలా పోషించాలని తరచూ మథనపడేది. ఈక్రమంలోనే శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కాసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఉరికి వేలాడుతున్న ఆమెను కిందికి దించి పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం తరలించారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

● ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల దాడి


ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగిన తల్లిదండ్రులు

ఉరవకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సతీష్‌పై విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు దాడి చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే మండలంలోని చాబాల ఉన్నత పాఠశాలలో పనిచేసిన సతీష్, బదిలీపై గడేహోతూరుకు వచ్చారు. తాము టాయిలెట్‌కు వెళ్లేటపుడు వెంట వస్తున్నాడని, దండించే పేరిట శరీరాన్ని తాకుతున్నారని పలువురు విద్యార్థినులు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు శనివారం పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. కోపోద్రిక్తులై ఆయనపై దాడి చేశారు. ఇతర ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి ఉపాధ్యాయుడు తమకొద్దని తల్లిదండులు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొడవ నేపథ్యంలో ఎస్ఐ నాగస్వామి పాఠశాలకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిపై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం ఎంపిక


కమిటీని ప్రకటిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ శనివారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన పదాధికారులు మూడేళ్లపాటు పదవిలో ఉంటారన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా పి నాగరాజు (అనంతపురం), ఎంపీ ఈశ్వర్‌ప్రసాద్ (అనంతపురం), సత్యనారాయణ రెడ్డి (రాయదుర్గం), ఆదినారాయణ (కళ్యాణదుర్గం), మారుతి గోవిందప్రసాద్ (అనంతపురం), ముప్పూరి దేవరాజ్ (కళ్యాణదుర్గం), ప్రధా న కార్యదర్శులుగా సి అశోక్‌రెడ్డి (అనంతపురం), బి శ్రీదేవి (గుంతకల్లు), ఆంజనేయులు (తాడిపత్రి), కార్యదర్శులుగా నాగేంద్రబాబు (అనంతపురం), కవితాశర్మ (గుంతకల్లు), మల్లీశ్వరి (ఉరవకొండ), చైతన్యకిశోర్ (రాప్తాడు), నారాయణరెడ్డి(గుంతకల్లు), అరుణమ్మ (రాయదుర్గం), కోశాధికారిగా ఎంకే అయ్యన్న (అనంతపురం), ఐటీ సెల్ కన్వీనర్‌గా భీమశంకర్ (ఉరవకొండ), సోషల్ మీడియా కన్వీనర్‌గా దినేష్‌రెడ్డి (శింగనమల) ఎంపికయ్యారు.

22 వరకు డైట్ సెట్ కౌన్సెలింగ్

బుక్కపట్నం, జూలై19(ఆంధ్రజ్యోతి): డైట్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ఈనెల 22వతేదీ వరకు నిర్వహించనున్నట్లు బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకి సంబంధించి కేటాయించిన 156 మంది అభ్యర్థులకుగాను ఇప్పటివరకు 31 మంది అడ్మిషన్ పొందారన్నారు. వీరిలో 21 మంది ప్రభుత్వ డైట్ కళాశాలలో, పదిమంది అనంతపురంలోని బాలాజీ కాలేజీలో చేరారన్నారు. వారు ఈనెల 25వ తేదీ నుంచి కేటాయించిన కళాశాలకు హాజరుకావాలని తెలిపారు.

జర్మన్ భాషపై శిక్షణ

అనంతపురం వైద్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో జర్మన్ భాషపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శిక్షణను డీఆర్వో మలోల ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మొదటి బ్యాచ్‌కు 42మంది విద్యార్థులు ఎంపియ్యారన్నారు. వీసీ, ఫ్లైట్ టిక్కెట్ ఖర్చులు కూడా సంస్థ భరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయేశ్వరీ దేవి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనంతమ్మ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘనస్వాగతం



జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌కు మొక్కలను కానుకగా ఇస్తున్న అనంత కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌కు ఇరు జిల్లాల ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌కు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి, పూలమొక్క అందించారు.

బడిగాపులు..!

● ముఖహాజరుకు టీచర్ల ఫీట్లు
● సర్వర్ సమస్యతో తిప్పలు


ముఖహాజరు కోసం బుక్కరాయసముద్రం కాంప్లెక్స్‌లో టీచర్లపాట్లు

అనంతపురం విద్య, జూలై19(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్‌కు సర్వర్ కష్టాలు ఈసారీ తప్పలేదు. ముఖహాజరుకు టీచర్లు ఫీట్లు చేయాల్సి వచ్చింది. శనివారం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 135 స్కూల్ కాంప్లెక్స్‌లలో సమావేశాలు నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, జడ్పీ, మండల, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 వేల మంది టీచర్లు హాజరయ్యారు. ఉదయం పాఠశాలలో విధులు నిర్వర్తించి, మధ్యాహ్నం రెండుగంటల నుంచి తమకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు అందరూ హాజరయ్యారు. ఆ తర్వాతనే ముఖహాజరు అవుట్‌టైమ్ నిబంధన పెట్టారు. సమావేశాలు ముగిసిన తర్వాత టీచర్లు ముఖహాజరు వేయడానికి ప్రయత్నిస్తే సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడ్డారు. అరగంటపాటు అంటే 5.30 గంటల వరకు సమావేశాల సెంటర్లలోనే టీచర్లు ఉంటూ ముఖహాజరుకోసం నానా ఫీట్లు చేయాల్సి వచ్చింది. కొందరు మహిళా టీచర్లు అక్కడే కూర్చుని ట్రై చేస్తూ కనిపించారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. గతంలోనూ కాంప్లెక్స్ మీటింగ్ ముగిసిన తర్వాత హాజరుపడక ఇబ్బందులు పడ్డారు. అపుడు హాజరు తప్పనిసరి అనడంతో రాత్రి 7 గంటల వరకు స్కూల్ వద్దనే కాచుకు కూర్చున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్య తలెత్తడంతో అప్పట్లో కావాలనే సర్వర్ డౌన్ చేశారనే విమర్శలు వచ్చాయి. విషయం విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశించారు. శనివారం కూడా సర్వర్ సమస్య తలెత్తడంతో టీచర్లు ముఖహాజరు వేయడానికి ఇబ్బంది లు పడ్డారు. విద్యాశాఖ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


ఇక.. నిలబడలేను..

ముస్సోరీలో శిక్షణకు కలెక్టర్

ఇన్‌చార్జిగా జేసీ శివనారాయణ్ శర్మ



అనంతపురం కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ శిక్షణ నిమిత్తం ముస్సోరీకి వెళ్లారు. ఐఏఎస్ అధికారులకు ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్ఎన్ఏఏ)లో నిర్వహించే మిడ్ కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాం(ఎంసీటీపీ) (23వరౌండ్ ఫేస్3)లో కలెక్టర్ పాల్గొననున్నారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు శిక్షణలో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన బయలుదేరి వెళ్లారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీ శివనారాయణ్ శర్మ వ్యవహరిస్తారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేయాలి: డీఎంహెచ్ఓ


అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి.. అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం ఆమె.. జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాలు సకాలంలో అమలు చేయాలన్నారు. సమీక్షలో ప్రోగ్రాం ఆఫీసర్లు యుగంధర్, అనుప, శ్రీనివాసరెడ్డి, అధికారులు కిషోర్, ఫణి పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి సవిత

ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'లో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండలో గాంధీ సర్కిల్ వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధికారులు, నాయకులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు వురు వ్యాపారులకు మంత్రి సవిత ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల పర్యావరణం కాలుష్యమయ్యే ప్రమాదం ఉందని ఇప్పటికే శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారన్నారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, కన్వీనర్ శ్రీరాములు, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, అడదాకులపల్లి ప్రసాద్, షౌకత్, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలి

● జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆచార్య దేవన్న


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు

అనంతపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని జేఎన్‌టీయూ ఓఎస్‌డీ టూ వీసీ ఆచార్య దేవన్న పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడి టోరియంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహిం చారు. వీసీ సుదర్శన్‌రావు ఆన్‌లైన్ ద్వా రా పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురించి మాట్లాడారు. తర్వాత ఆచార్య దేవన్న మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కుటుం బంతో కలిసిన అనుభూతి కలుగుతోందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన వయసును మరచిపోయి, యువకులుగా మారి పాత జ్ఞాపకా లను గుర్తు చేసుకొని ఆనందిస్తామన్నారు. అలుమ్నీ అసోసియేషన్ కళాశాలకు బలమని, యూనివర్సిటీ అభివృద్ధిలో అలుమ్నీ సభ్యుల సలహాలు, సూచనలు ఎప్పుడు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో కళాశాల, యూనివరిటీని మరింత ముందుకు తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రొఫెసర్లు , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీకి ప్రవేశాలు

● 28 వరకు దరఖాస్తుకు అవకాశం

అనంతపురం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద ఏర్పాటుచేసిన సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వీసీ ఎస్ఏ కోరి శనివారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి బీఏలో పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్, బీకాం, బీబీఏతోపాటు బీఎస్సీలో ఎకనామిక్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రీటైల్ మేనేజ్‌మెంట్, ఐటీ, బీటెక్ కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈనెల 28 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు https://cuapcuet.samarth.edu.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బడికి పొగ..!

(5వ పేజీ తరువాయి)

బాలికల ఉన్నతపాఠశాలలో రెండుచోట్ల వంట చేస్తున్నారు. తరగతి గదుల మధ్యలో వంట చేస్తుండటంతో కట్టెల నుంచి వచ్చే పొగ తరగతి గదులను కమ్మేస్తోంది. ఆస్తమా, అలర్జీ, ఉన్న కొంతమంది విద్యార్థులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. తరగతి గదుల్లోకి పొగ రావడంతో ఉపాధ్యాయులు కూడా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. బాలుర ఉన్నత, బాలుర జూనియర్ కళాశాలు కలిసి బాలుర ఉన్నతపాఠశాలలో వంట వండుతున్నారు. కట్టెల మీదే వండుతున్నారు. ఈపొగ మొత్తం తరగతి గదుల వరకు వస్తోంది. కట్టెలతో వంట చేయడం వల్ల అన్నం ముద్దముద్దగా ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. వంట చేయడా నికి గ్యాస్ సిలిండర్లను పక్కనపెట్టి టన్నులకొద్ది కట్టెలు తీసుకొచ్చి నిల్వ చేశారు. మధ్యాహ్నం అయితే చాలు పొగతో పాఠశాల ఆవరణం నిండిపోతోంది. ఇదే పరిస్థితి నల్లచెరువు ఉన్నతపాఠశాలలోనూ, ఎన్పీకుంట ఉన్నతపాఠశాలలోనూ, నల్లమాడ, ఓడీసీ, అమడగూరు తదితర ఉన్నత పాఠశాలల్లో ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులకు శ్వాసకోశ వాధ్యులు వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.


కదిరి బాలుర ఉన్నతపాఠశాలలో వంట కోసం నిల్వ ఉంచిన కట్టెలు

కట్టెలతో వంటలు చేస్తున్న ఏజెన్సీలు

ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలు గ్యాస్‌తోనే వంట చేయాలి. ఉన్నతపాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం సన్నబియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు ఉచితంగా సరఫరా చేస్తోంది. కిరణా వస్తువులు, గ్యాస్ కోసమే ఒక విద్యార్థికి నెలకు రూ.250వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం గ్యాస్ వాడకుండా కట్టెలమీద వంట చేస్తున్నారు. దీంతో రెండు రకాల నష్టాలున్నాయి. పొగతో పాఠశాల ఆవరణం నిండిపోతోంది, భోజనం కూడా చేయడానికి సరిగా వీలుండదు. అందుకే గ్యాస్ వాడమని అధికారులు సూచించినా ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోవడంలేదు.

గ్యాస్‌మీద చేయమని చెప్పా



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు గ్యాస్ మీద వంట చేయాలని పలుమార్లు చెప్పా. అయినా వారు పట్టించుకోవడం లేదు. కాలేజీ విద్యార్థుల కోసం వంట చేయడానికి గదిని అక్కడే ఏర్పాటు చేశాం. త్వరలో అక్కడికి మారుస్తాం.

- వెంకటాచలం, హెచ్ఎం, బాలికల ఉన్నతపాఠశాల, కదిరి

చర్యలు తీసుకుంటాం



నిబంధనల మేరకు భోజన ఏజెన్సీలు గ్యాస్‌మీద వంట చేయాలి. అలా వంట చేయకపోతే, మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

- చెన్నక్రిష్ణ, ఎంఇఓ

క్యాన్సర్ యూనిట్ బాగయ్యేనా..!

(5వ పేజీ తరువాయి)

నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కోబాల్ట్ సోర్స్‌ను కొనుగోలు చేసినప్పుడల్లా అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డ్ (ఏఈఆర్‌బీ) నుంచి లైసెన్స్ తీసుకోవాలి. ప్రతి సంవత్సరం లైసెన్సును రెన్యువల్ చేసుకోవాలి. ఖచ్చితమైన ప్రమాణాలను పాటించాలి. చిన్న తప్పిదం జరిగినా లైసెన్స్ ఇవ్వరు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటారు. ఇంతటి క్లిష్టమైన ప్రక్రియన పూర్తి చేసి, రాజస్థాన్ నుంచి కోబాల్ట్ సోర్స్‌ను కొని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లను వెచ్చించింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఏఈఆర్‌బీ కమిటీ వచ్చి క్యాన్సర్ యూనిట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లింది.


పకడ్బందీగా పర్యవేక్షణ

కోబాల్ట్ సోర్స్‌ను తయారు చేసే కేంద్రం నుంచి దానిని అమర్చే ప్రాంతానికి చేర్చేవరకూ పోలీసు, ఇంటెలిజెన్స్ నిఘా ఏర్పాటు చేస్తారు. సోర్స్‌ను తరలించే దారి మొత్తం మ్యాపింగ్ చేస్తారు. ఆ మార్గంలోని సమీప పోలీస్ స్టేషన్‌లకు సమాచారం చేరవేస్తారు. కంటైనర్ నుంచి కోబాల్ట్ సోర్స్‌ను బంకర్‌లోకి చేర్చి.. టెలీ కోబాల్ట్‌లోకి అమర్చే ప్రక్రియను మొత్తం వీడియో, సీసీ కెమరాలతో రికార్డు చేస్తారు. స్క్రూటినీ మధ్య ప్రక్రియను పూర్తి చేస్తారు. పొరపాటున రేడియో యాక్టివ్ అయితే సాధారణ ప్రజానీకం ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని. అందుకే ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా పకడ్బందీగా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అనంతరం మిషన్ రన్ చేసి, కావాల్సిన అవుట్‌పుట్ వస్తుందని నిర్ధారణకు వచ్చినప్పుడే ప్రక్రియ పూర్తి అయినట్లు భావిస్తారు.

భవన నిర్మాణానికి ప్రణాళికలు

శారదా నగర్‌లోని క్యాన్సర్ యూనిట్‌లో వసతులు అరకొరగానే ఉన్నాయి. ఓపీ, ఐపీ, నర్సింగ్ స్టేషన్, డిస్పెన్సరీ.. ఇలా ఒక్కో విభాగం ప్రత్యేకంగా ఉండాలి. కానీ తాత్కాలికంగా ఒక షెడ్డును ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. రేడియో థెరపీ ప్రారంభమైతే, రోగుల సంఖ్య పెరుగుతుంది. అందుకు అనుగుణంగా కొత్త భవనాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. క్యాన్సర్ యూనిట్‌లోని ఖాళీ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతికోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. డీఎంఈ ప్రత్యేక చొరవ చూపితేనే నిర్మాణ పనులు ప్రారంభమౌతాయి.

త్వరలోనే ప్రారంభిస్తాం...



క్యాన్సర్ యూనిట్‌లో రేడియో థెరపీ సేవలను త్వరలోనే పునఃప్రారంభిస్తాం. టెలీకోబాల్ట్ యంత్రానికి సర్వీస్, క్వాలిటీ అష్యూరెన్స్ లైసెన్స్ వంటి ప్రక్రియలను ఇప్పటికే ప్రారంభించి తుది దశకు తీసుకువచ్చాం. కొత్త భవన నిర్మాణానికి ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

- డాక్టర్ ఆత్మారామ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్

అనుమతులు కఠినతరం..



కోబాల్ట్ సోర్స్‌ను కొనుగోలుకు అనుమతులు కఠినంగా ఉంటాయి. ఏఈఆర్‌బీ అనుమతులు పొందిన తరువాత కమిటీ మన కేంద్రాన్ని పరిశీలిస్తుంది. వీడియోస్, సీసీ కెమరాలు, స్క్రూటినీ మధ్య టెలీకోబాల్ట్ యంత్రంలోకి సోర్స్‌ను అమరుస్తారు.

- ప్రొఫెసర్ సతీష్ కుమార్, రేడియో థెరపీ విభాగం

ప్రమాదకరంగా విద్యుత్ లైన్

- రెండేళ్లుగా బీడుగా వదిలేసిన మహిళా రైతు
- ఇళ్ల నిర్మాణానికి వెనుకంజవేస్తున్న గొట్లూరు వాసులు


తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్‌ను చూపుతున్న రైతు గౌరమ్మ

బుక్కపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం ఓ మహిళా రైతుకు శాపంగా మారింది. ఆమె తన పొలంలో బోరుబావి వేయించింది. నీరు పడింది. పంట పెట్టు కుందామంటే పొలంలో విద్యుత్ లైన్ అడ్డంకిగా మారింది. తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్ ఉండ డంతో ట్రాక్టర్లు పొలంలోకి వెళ్లలేని దుస్థితి దాపురించింది. దీంతో ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి బోరు వేసుకున్నా.. పంట పెట్టుకోలేక బీడుగానే వదిలేసినట్లు ఆమె చెబుతున్నారు. చెన్నేకొత్తపల్లి మండలం అడవి బ్రాహ్మణపల్లికి చెందిన మహిళా రైతు గౌరమ్మకు బుక్కపట్నం మండలంలోని ధూపంపల్లి వద్ద రెండెకరాల పొలం ఉంది. పంటలు సాగు చేసుకుందామని అందులో రెండేళ్ల క్రితం ఆమె అప్పులు చేసి, బోరు వేయించారు. పంటలు సాగుచేద్దామంటే పొలం మధ్యలో విద్యుత్ లైన్ అడ్డంకిగా మారింది. ఆమె పొలం మీదుగా 11 కేవీ విద్యుత్ లైన్ లాగారు. అందుకు సంబంధించిన తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. అవి తగులు తాయని వ్యవసాయ పనులు చేసేందుకు ట్రాక్టర్లు రావట్లేదు. విద్యుత్ లైన్ ఎత్తు పెంచాలని రెండేళ్లుగా ట్రాన్స్‌కో అధికారులకు అర్జీలు ఇస్తున్నా పట్టించుకోవట్లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలంలో వెళ్లేటప్పు డు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా.. ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. దీంతో చుట్టుపక్కల పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు నిత్యం భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ లైన్ ఎత్తు పెంచి, తన పొలంలో పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని మహిళా రైతు వేడుకుంటున్నారు.

మా దృష్టికి రాలేదు

గౌరమ్మ పొలంలో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్న విషయం మాదృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి, విద్యుత్ తీగల ఎత్తు పెంచి, సమస్యను పరిష్కరిస్తాం.

-నారాయణస్వామి నాయక్, ఏఈఈ, ట్రాన్స్‌కో, బుక్కపట్నం.

ఇళ్ల స్థలాల్లో చేతికందే ఎత్తులో...

● ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరులో చేతికందే ఎత్తులో విద్యుత్‌తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆ గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలే గ్రామానికి చెందిన బెస్త చంద్రశేఖర్, పిట్టా నరసింహులు విద్యుత్ శాఖ స్థానిక కార్యాలయానికి వెళ్లి, ఏఈ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తమ ఇళ్ల స్థలాల మీదుగా విద్యుత్‌తీగలు వెళుతున్నాయని అన్నారు. అవి ప్రస్తుతం వీస్తున్న గాలులకు కిందకు రావడంతో భయంభయంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ విద్యుత్‌తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో తమ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేక పోతున్నామన్నారు. తమ ఇళ్ల స్థలాల సమీపంలోనే విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని దీంతో తీగలు కిందకు వచ్చాయన్నారు. ఎవరైనా తెలియక ఈ ప్రాంతంలోకి వస్తే ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుందని వారు వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఆ తీగలను పక్కకు మార్చి ప్రాణాపా యం లేకుండా చేయాలని వారు కోరారు. ఈ సమస్యపై విద్యుత్ ఏఈ జానకిరామయ్య మాట్లాడుతూ విద్యుత్‌స్తంభాలు ఒరిగి తీగలు కిందకు వేలాడుతున్నాయని, దీనిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడ స్థలవివాద సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామని తెలిపారు.


కిందకు వేలాడుతున్న విద్యుత్‌తీగలను చూపుతున్న గ్రామస్థులు

న్యూస్ బాక్స్

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

అమడగూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లిలో వెలసిన కోదండ సీతా, రామ లక్ష్మణ అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేసి అలంకరించారు. అష్టోత్తర శతనామ పూజ చేశారు. దేవర కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈపూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఫసల్ బీమాకు దరఖాస్తు చేసుకోండి: ఏఓ

అమడగూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పంటలు సాగుచేసిన రైతులు ఫసల్ బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వెంకటచారి శనివారం ఓ ప్రకటనలో తెలిపా రు. అవసరమైన వారు ఫోన్ నంబర్ 9398354744కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు.

27న యోగా పోటీలు

ధర్మవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల మున్సిపల్ పాఠశాలలో ఈ నెల 27న యోగాసన స్పోర్ట్స్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి, యోగా మాస్టర్ ఈశ్వరయ్య తెలిపారు. ఈ మేరకు సాంస్కృతిక మండలిలలో శనివారం యోగాసనాల పోటీలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలాగాళ్ల చిన్నవెంకటేశులు, కట్టారవి, ఆదినారాయణ, వెంకటలక్ష్మయ్య, తిరుమలేశ్, సాయిప్రసాద్, నాగరాజు, బాబ్జాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫ్లోర్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

బుక్కపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో పాల్గొనే అండర్-14, 19 విభాగాల్లో జిల్లా జట్లను శనివారం మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. పాఠశాల హెచ్ఎం జగదీష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో దాదాపు 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కబరచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 3న పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి 19వ ఫ్లోర్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో జిల్లా ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పూల ప్రకాష్, పీడీలు రామక్రిష్ణ, ఉషారాణి, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పిన్నదరి గ్రామానికి పీరు అందజేత


పిన్నదరి గ్రామస్థులకు పీరును అందిస్తున్న రామిరెడ్డి

తాడిమర్రి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నదరి గ్రామ పెద్దలకు నార్పల మండలం బండ్లపల్లికి చెందిన బారెడ్డి రామిరెడ్డి, ఆయన భార్య అంజినమ్మ శనివారం రూ.4.05 లక్షల విలువైన పెద్దమౌలాలి పీరును అందజేశారు. మొహర్రం సందర్భంగా మౌలాలి పీరును ఇటీవల ఏకపాదంపల్లి, పిన్నదరి గ్రామాల్లో ఊరేగించారు. అయితే పిన్నదరి గ్రామ పెద్దలు కేశవనారాయణ, తిరుపాల్‌నాయుడు, సత్యనారాయణరెడ్డి ఆ పీరును తమ గ్రామానికి అప్పగించాలని రామిరెడ్డిని కోరారు. దీంతో రామిరెడ్డి దంపతులు శనివారం మౌలాలిస్వామికి పూజలు నిర్వహించి పిన్నదరి గ్రామంలోని పీర్లచావిడిలో గ్రామపెద్దలకు అందజేశారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ముదిగుబ్బ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకొని ముదిగుబ్బ అప్‌గ్రేడ్ సీఐ శివరాముడు శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు సీఐ పలు సూచనలు చేశారు. పోలీసులు గణేష్, ఓబులప్ప, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై జాప్యమేల?: బీజేపీ

కొత్తచెరువు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా అక్రమ కట్టడాలను తొలగించడంలో ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారుల తీరుపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని బీజేపీ కార్యలయంలో ఆ పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ కోకన్వీనర్ శేషాద్రి నాయుడు పార్టీ స్థానిక నాయకులతో కలసి శనివారం విలే కరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మండ ల కేంద్రంలోని నాలుగు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆర్ అండ్ బీ స్థలాల్లో కొందరు అక్రమకట్టడాలను నిర్మిం చారని అన్నారు. దీంతో రోడ్లు కుంచించుకు పోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంద న్నారు. ఈ అక్రమ కట్టడాలని తొలగించుకోవాలని అధికారులు నోటీసులు ఇచ్చి రెండు నెలలు కా వస్తున్నా కొందరు తొలగించక పోవడంలో అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

పాఠశాలలో రొబోటిక్ ప్రదర్శన

ధర్మవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని రిషి విద్యాలయంలో రొబోటిక్ ప్రద ర్శనను నిర్వహిం చా రు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కరణ్ స్వరూప్‌సింగ్, డీన్ భాస్కర్ మాట్లాడుతూ... పిల్లలు రొబోటిక్స్ ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్, ఆధునిక కంప్యూటర్ విజ్ఞానంపై పట్టు సాధించాలని పాఠశాలలలో సైబర్ స్క్వేర్ డిజిట్యాబ్‌ను ప్రారంభించామని తెలిపారు. పాఠశాల సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలి'

ఓబుళదేవరచెరువు, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నాయత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, శ్రీవిజ్ఞాన్ సీబీఎస్ పాఠశాల కరస్పాండెంట్ కె. మస్తాన్ పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఇన్‌వే స్టీచర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థి నాయకులుగా ఎన్నికైన విద్యార్థులకు వారు బ్యాడ్జీలు అందజేశారు. ప్రిన్సిపాల్ ఫిల్‌స్థామస్, వైస్ ప్రిన్సిపాల్ ఫరీయాజ్‌బేగం, కో ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో తనకల్లు మండల వాసి మృతి

తనకల్లు, జూలై 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని కుప్పం సమీపంలో రాళ్లబరుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి తనకల్లు మండల వాసి రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు శనివారం గ్రామస్థులు తెలిపారు. తనకల్లు మండలంలోని ఎర్రబల్లికి చెందిన వెంకటేష్ (27) రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. కర్ణాటక రాష్ట్రంలోని శ్రీనివాసపూర్ నుంచి మామిడి కాయలను క్రిష్ణగిరికి ఐచర్ వాహనంలో తరలిస్తుండగా కుప్పం సమీపంలోని రాళ్లబరుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో డ్రైవర్ వెంకటేష్ మృతిచెందారు. విషయం తెలుసుకున్నబంధువులు, స్నేహితులు శనివారం సంఘటనాస్థలానికి వెళ్లారు. మృతునికి ఇంకా పెళ్లి కాలేదన్నారు. యువకుడు మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యేని కలిసిన మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్


ఎమ్మెల్యే కందికుంటతో చైర్‌పర్సన్

కదిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కందికుంట వెంటక ప్రసాద్‌ను శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తనకల్లు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా నియితులైన చంద్రకళ, పలువురు టీడీపీ నాయకులు కలిశారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యేకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మార్కెట్ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు జయకుమార్ నాయక్, రమణనాయక్, క్రిష్ణానాయక్, ప్రసాద్ తదితరులున్నారు.

రెడ్డిపల్లి ఆరోగ్య కేంద్రం పరిశీలన

నల్లమాడ, జూలై19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ ఫైరోజాబేగం తనిఖీ చేశారు. హాజరు పట్టి, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌ను, కాన్పుల గదిని పరిశీలించారు. అనంతరం ఓపీకి ఎంతమంది వస్తున్నారని డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సదుపాయాలను పరిశీలించారు. మందుల నిలువ గదిని తనిఖీ చేశారు. అనంతరం రామాపురం వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి, అక్కడ వంట గదులను, హాస్టల్ గదులను పరిశీలించారు. ఆమెతో పాటు ఇమ్యూనైజేషన్ అధికారి నాగేంద్రనాయక్, వైద్యులు దీప్తి, సీహెచ్‌ఓ రామాంజులు, అంబేడ్కర్ పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సచివాలయాలకు శనివారం హాఫ్ డేనా?


సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

గాండ్లపెంట, జూలై 19 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలోని సచివాల యానికి శనివారం హాఫ్ డేనా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 నుంచి 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. శనివారం మధ్యాహ్నం 2గంటలకే కటారుపల్లి సచివాలయానికి అధికారులు తాళం వేసి వెళ్లిపోయారు. అలాగే పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని కూడా మూసివేశారు. పలువురు వివిధ పనులపై వచ్చిన వారు శనివా రం హాఫ్‌డేనా అంటూ విమర్శించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించలేదని చెబుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ వెంకటరమణారెడ్డిని వివరణ కోరగా సిబ్బందిని అడిగి తెలుసుకుంటానని తెలిపారు.

సమస్యలపై మంత్రికి వినతులు


మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు గోవిందు

నల్లమాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన నల్లమాడలో శనివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు పలు వురు వినతులు అందజేశారు. నల్లమాడ నుంచి కుటాలపల్లి ప్రాథమిక పాఠశాల వరకు, అలాగే పాఠశాల నుంచి అక్కదేవతల గుడివరకు తారురోడ్డు వేయాలని నల్లమాడ సర్పంచ్ రమావత్ భారతి విన్నవించారు. అలాగే అలాగే నల్లమాడ-చెరువువాండ్లపల్లి, నల్లమాడ-చిల్లగోర్లపల్లి, నల్లమాడ- పెమనకుంటపల్లి తారురోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. పెమనకుంటపల్లి నుంచి గ్రీన్‌ఫీల్డు హైవే వరకు తార రోడ్డు వేయాలన్నారు. అలాగే సీపీఎం కార్యదర్శి గోవిందు ఇచ్చిన వినతిలో.... నల్లమాడ ఎస్సీ కాలనీలో మురుగునీటి కాలువ సమస్య పరిష్కరించాలని, పలు వీధుల్లో సీసీరోడ్లు వేయాలని, ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు అందించాలని కోరారు.

సత్యమ్మ గుడి వద్ద చర్చకు సిద్ధమా?

● ముదిగుబ్బ ఎంపీపీ

ముదిగుబ్బ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏబీ పల్లి తండాలో గిరిజన భూములు లాక్కున్నానని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. 2014లో అప్పటి ప్రభుత్వం భూపంపిణీ చేసిందని, ఆ భూ పంపిణీలో 17 ఎకరాలు భూమి మాత్రమే తన కుటుంబ సభ్యుల పేరు మీద ఉందన్నారు.

షోకాజ్ నోటీసులు లేకుండా సస్పెన్షన్ తగదు

● వైసీపీ నాయకుడు తలమర్ల సంజీవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): షోకాజ్ నోటీసుల్లేకుండా ఏకపక్షంగా వైసీపీ నాయకులు నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిని సస్పెండ్ చేయడం పద్ధతి కాదని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్య దర్శి తలమర్ల సంజీవరెడ్డి విమర్శించారు. ఆయన శనివారం పట్టణం లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... వైసీపీ ఆవిర్భా వం నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతో అంకితభావంతో పనిచేసిన నాయకు లకు కనీసం సంజాయిషీ ఇచ్చుకోవడానికి కూడా అవకాశం కల్పించక పోవడం దారుణమన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన దీపికరెడ్డికి పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా అంకితభావంతో పనిచేసిన నాయకులు నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. చెప్పుడుమాటలు వినే వైఎస్ జగన్‌రెడ్డి మొదట తన సలహాదారులను మార్చుకోవాలని, జగన్ సలహాదారులే పార్టీని బలహీనం చేస్తున్నారని సంజీవరెడ్డి ఆరోపించారు. పార్టీలో నాయకులకు సయోధ్య కుదర్చాలికాని సస్పెండ్ చేయడం ఏమిటన్నారు. ఇలాగే సస్పెండ్ చేస్తూపోతే పార్టీలో ఎవరూ మిగలరని ఆయన హెచ్చరించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం


పెడపల్లిలో చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగ్ ముద్దంటూ సీడీపీఓ జయంతి చిన్నారుల తల్లితండ్రులకు సూచించారు. మండలపరిధిలోని పెడపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, వారి తల్లులతో కలసి ప్లాస్టిక్ వద్దంటూ శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత అంగ న్‌వాడీ కార్యకర్తలు తల్లులు చిన్నారులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరం రూరల్ మండలంలోని పోతుకుంట, తాడిమర్రి, నల్లచెరువు, ఓబుళదేవరచెరువు మండల కేంద్రాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

పీర్ల చావిడికి డ్రమ్స్ వితరణ

నల్లచెరువు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బసవన్నకట్ట సమీపంలో శనివారం మొహర్రం సందర్భంగా స్థానిక క్రిష్ణ హోటల్ యజమానికి కుమారుడు రాంప్రసాద్ రూ.పదివేల విలువ చేసే డ్రమ్స్ వితరణ చేశారు. వాటిని పీర్ల చావిడి సభ్యులకు అందించారు. చావిడి సభ్యులు రాళ్లపల్లి బావాజీ, రాళ్లపల్లి ఇంతియాజ్, వినోద్, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ.. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

కదిరి అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీఓ హోమ్‌లో శనివారం సీపీఎం నాలుగో పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. పట్టణంలోని ప్రజాసమస్యలపై కేంద్రీకరించి పనిచేయాలని పిలుపునిచ్చారు. గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు కదిరి పట్టణంలో పార్టీ నిర్వహించిన ఆందోళన, పోరాటాలను సమీక్షించి, భవిష్యత్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. అనంతరం కదిరి ప్రాంతీయ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా జగన్మోహన్, సభ్యులుగా బాబ్‌జాన్, జీఎల్ నరసింహులు, సాంబశివ, శంకర్‌రెడ్డి, రామమోహన్, ముస్తాక్, శాంతిబాయి, మహబూస్నీషా, శివ, హరినాథ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, పెద్దన్న, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామూహిక ఏడు శనివారాల వ్రతం


వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, జూలై19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేశ్ ఆధ్వర్యంలో 40మంది మహిళలు సామూహిక ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

నేడు జ్ఞాన గాయత్రి మహాయజ్ఞం

● ధర్మవరం: పట్టణంలోని శివానగర్‌లో శివాలయం వద్ద ఆదివారం 108 కుండములతో జ్ఞాన గాయత్రి మహా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ధర్మవరం గాయత్రీ పరివార్, శివాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పరిశే సుధాకర్, ప్రసాద్, పామిశెట్టి శివశంకర్, గుండా పుల్లయ్య, దాసరి రంగయ్య, భాగ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి కలశ శోభాయాత్ర ఉంటుందన్నారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

'అందరి లక్ష్యం స్వచ్ఛాంధ్ర'


బత్తలపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈఓ

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

చిన్న గ్రామం నుంచి పెద్ద పట్టణాల వరకు స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుదామని జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. మండ లకేంద్రమైన బత్తలపల్లిలో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీని బాలుర బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల తో ర్యాలీ నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశా రు. అనంతరం జక్కంపూటి వెంకటేశు లు బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అధికారులు చెత్తను తొలగించారు. డీడీఓ జనార్దనరావు, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఓ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ కిష్టప్ప, ఎస్ఐ సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే అమడగూరు, గాండ్లపెంటలోను స్వచ్ఛత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అలాగే గాండ్లపెంట మండలం మల్లమీదపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం హైదరవలీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కదిరి మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో డీఎల్‌పీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్ర మంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శి రామమోహన్, మాజీ సర్పంచ్ గంగులప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీ పాలనలోనే సంక్షేమానికి పెద్దపీట'


సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలోనే సంక్షేమానికి పెద్దపీట వేశారని దొరిగల్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం దొరిగల్లు, దొరిగల్లు క్వా ర్టర్స్ నక్కలపల్లి, నాగులగుబ్బల గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు దేగల శివయ్య, రామాంజి, సునీల్, రవితేజ, చిన్న నారాయణ, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

పుట్టపర్తి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని మహి ళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో శక్తిటీం సభ్యులు విద్యార్థిని, విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్ర పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన జనసంచార ప్రదేశాలలో వారు శనివారం శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ నంబర్ 7993485111ఫోన్ చేసి పోలీసుల సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓలు, ఉపాధ్యాయిలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కొత్తచెరువు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని మండలకేంద్రానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ మారుతీశంకర్ శనివారం తెలిపారు. ఎనిమిది రోజుల క్రితం తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఇద్దరు మహిళలు చేసిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసులుపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అతడిని శనివారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కూటమితోనే చేనేతలకు న్యాయం

● మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే చేనేతలకు న్యాయమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం చేనేత కార్మికుల కోసం కేంద్రప్రభుత్వంచే చిన్నముగ్గాల క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 292మంది గుర్తింపు పొందిన చేనేత కార్మికుల కోసం రూ.1.51కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధిపొందిన కార్మికులకు తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రం వద్ద అవగాహన సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతీసుకుని చేనేత కార్మికులకు రూ.1.51కోట్లు మంజూరు చేయించారన్నారు. ఇందులో 143మందికి రూ.59లక్షలు విడుదల చేశారన్నారు. చేనేత పరికరాలు, ఎలక్ట్రానిక్, జాకార్డులు వర్క్‌షెడ్ల కోసం దరఖాస్తులు చేసుకోని వారిని గుర్తించి ఎంపిక చేయాలన్నారు. ఇందులో 90శాతం కేంద్ర ప్రభుత్వం ఇస్తే పదిశాతం లబ్ధిదారుడు చెల్లించాలన్నారు. చేనేత జౌళి శాఖ అధికారి రామక్రిష్ణ, నవీన్, హరిక్రిష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

న్యూస్ బాక్స్

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



రొళ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళెంలో వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి శనివారం కావడంతో భక్తు లు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేట వెంకటరమణుడికి..



హిందూపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరి శనివారం పురస్కరించుకుని పేట వెంకటరమణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్‌కు అభినందన


చైర్‌పర్సన్‌కు బొకేలు అందిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ శైలజ వెంకటేశ్‌కు శనివారం నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. నడింపల్లిలోని ఆమె స్వగృహంలో నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువలతో సన్మానించారు. కన్వీనర్ వెంకటేశులు, మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప, ఆంజనేయులు, చంద్ర, సీనీ హరి, శ్రీరాములు, అంజి, మహేంద్ర, వడ్డెసూరీ, సంజీవప్ప, సోమశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

అగళి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ సుబ్బారావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తొమ్మిది అంశాలపై గ్రామాల పురోగతిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగానే పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, పచ్చదనం, మహిళాభివృద్ధి సాంఘిక సంక్షేమాభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీపీ రేణుక, కామరాజ్, ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, మంజునాథ్, ఏపీఎం సురేష్, సూపర్‌వైజర్ లీలావతి పాల్గొన్నారు.

69 బంగారు కుటుంబాల ఎంపిక


గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

మడకశిర రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల, బుళ్ళసముద్రం గ్రామాల్లో శనివారం పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) పై గ్రామ సభలు నిర్వహించి 69 బంగారు కుటుంబాలను ఎంపికచేసినట్లు పంచాయతీ కార్యదర్శులు దివాకర్,రమేశ్ తెలిపారు. వారు మాట్లడుతూ గుండుమల పంచాయతీ గ్రామాల్లో సర్వేచేసిన 258 మందిలో గ్రామ సభద్వారా 51 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. బుళ్ళసముద్రం పంచాయతీలో 18 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. సర్పంచులు కరియన్న, రంగమ్మ, మాజీ సర్పంచులు చంద్రప్ప, జైపాల్ పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

రొళ్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలు, మహిళలకు దివ్యాంగులు, విద్యార్థులకు నిత్యం సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పోస్టుకార్డులతో విద్యార్థులు విన్నవించారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అలుపనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోస్టుకార్డులు చేతపట్టుకుని ర్యాలీ చేశారు. ఆర్డీటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటూ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


విద్యార్థి తల్లికి చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

హిందూపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో మృతిచెందితే ఆయన బిడ్డకు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆర్థిక సాయం అందించి విద్యాభివృద్ధికి చేయూతనిచ్చినట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. కొద్దిరోజుల క్రితం చిలమత్తూరుకు చెందిన ఉప్పర శ్రీనివాస్ అనే కార్యకర్త అనారోగ్యంతో మృతిచెందాడు. ఇటీవల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతున్న సమయంలో కార్యకర్త కుమారుడు నితిన్ విద్యకు సంబంధించి కోఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.2.5లక్షలు ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. శనివారం కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. మండల కన్వీనర్ ఎగువింటి శ్రీనివాసులు, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, చంద్రమోహన్, మంజునాథ్, నాగరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

పెనుకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి):పెనుకొండ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్వాతిని స్థానిక దళిత సంఘం నాయకులు సన్మానించారు. శనివారం దళిత సంఘం నాయకులు రామాంజనేయులు, ఎంఎస్ మూర్తి, పెద్దన్న ఆమెను కార్యాలయంలో కలిసి పూలమాలలువేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కోనాపురం పెద్దన్న, నరసింహులు, చలపతి పాల్గొన్నారు.

పాతప్ప స్వామికి పూజలు

గుడిబండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయపురం గ్రామ సమీపంలో వెలసిన పాతప్ప స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఎస్.రాయాపురం మేకలగట్ట జీఎస్ తాండా తదితర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సీఎం సభకు భారీ ఏర్పాట్లు

● సభావేదికను పరిశీలించిన ఎమ్మెల్యే, డీసీ


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్, కలెక్టర్ శుభకళ్యాణి

పావగడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం పావగడకి రానున్న సందర్భంగా ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ శుభకళ్యాణి, పంచాయతీ సీఎస్ ప్రభు శనివారం మహాత్మగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభ వేదికను పరిశీలించారు. సోమవారం సిద్దరామయ్య పావగడకు హెలీక్యాప్టర్ ద్వారా భద్రనీరు ఇంటింటి గంగపేరిట ప్రారంభోత్సవం చేయనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పావగడకు సీఎం తొలిసారిగా వస్తున్న సందర్భంగా గట్టి బందోబస్తుతో పాటు ఘనస్వాగతం పలకడానికి అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, కృషి చేస్తున్నారు. సభా వేదికలో వివిధ శాఖల నుంచి లబ్ధిదారులకు పింఛన్లు, నష్టపరిహారాలు, కార్మికుల కిట్లు పంపిణీ చేసేందుకు అన్నివిధాలా సిద్ధం చేశారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు బాధ్యతగా మెలగాలని కలెక్టర్ అధికారులను సూచించారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ స్థాయిలో తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

పెనుకొండ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇస్లాపురంలో పీర్లపండగ పురస్కరించుకుని సీసీకెమెరాలు ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శాంతి భద్రతలపై నిఘా ఉంచడానికి, నేరాలు అరికట్టడానికి, కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్, కౌన్సిలర్ హనుమంతు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీతో భవిష్యత్తు గ్యారెంటీ'

అమరాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీతో పేదల భవిష్యత్తుకు గ్యారెంటీ అని టీడీపీ నాయకుడు నాగోనపల్లి మంజునాథ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అని వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. అమ్మఒడి పథకాన్ని ఇద్దరు పిల్లలకు ఇస్తామని చెప్పి మోసం చేసింది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబో ఇంట్లో ఉన్న పిల్లలందరికీ ఇస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నారన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి వైసీపీకి లేదు: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబను విమర్శించే స్థాయి స్థానిక వైసీపీ నాయకులకు లేదని మాజీ సర్పంచు జైపాల్, టీడీపీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పథకాలపై వైసీపీ నాయకులు గ్రామాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో 100 పైగా హామీలు ఇచ్చారన్నారు. కేవలం నవరత్నాలుతో సరిపెట్టారని విమర్శించారు. అ పథకాలు కూడా చదువుకునే విద్యార్థులకు కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తింపచేశారన్నారు. చంద్రబాబు పేద విద్యార్థులు బాగా చదువుకోవలన్న సదుద్దేశ్యంతో తల్లికివందనం కింద కుటుంబంలోని చదువుకోనే అందరి పిల్లలకు అమ్మ ఒడి అందించారన్నారు. వైసీపీ నాయకులు గ్రామాల్లో టీడపీపై అసత్యప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు.

మైదుగోళంలో కార్డెన్ సెర్చ్

లేపాక్షి, జూలై 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు గ్రామమైన మైదుగోళంలో శనివారం హిందూపురం సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని చిల్లర దుకాణాలు, మద్యం విక్రయదారులు పాతనేరస్తుల ఇళ్లలో సోదాలు చేశారు. గ్రామం చివరన ఉన్న గడ్డివాముల్లో, పశువుల పాకల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తులు గ్రామంలో అనుమానంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎస్ఐ నరేంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నాగేశ్‌బాబు హెచ్చరించారు. మండలంలోని మెళవాయి గ్రామంలో నాకబందీ నిర్వహించారు. అనుమానం ఉన్న ఇళ్ళలో పోలీసులు సోదాలు చేశారు. గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేశారు సీఐ మాట్లాడుతూ నాటుసారా తయారీ, కర్ణాటక మద్యం అమ్మకాలు, మాట్కా జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.


గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ జనార్దన్

రావికుంటచెరువు ప్రక్షాళనకు శ్రీకారం


చెరువును శుభ్రపరిచే కార్యక్రమంలో డీపీఓ సమత

గోరంట్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావికుంటచెరువు కలుషితం కాగా, చెరువు ప్రక్షాళనకు డీపీఓ సమత శనివారం శ్రీకారం చుట్టారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. చెరువు కట్టల వద్ద పేరుకుపోయిన చెత్తను అధికారులతో కలిసి ఆమె శుభ్రం చేశారు. ముందుగా అధికారులు, కూటమి నాయకులు, పంచాయతీసిబ్బంది ర్యాలీ నిర్వహించి, మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ నిషేధం కోసం ఆదర్శంగా ఉండడానికి 47మంది పారిశుధ్య కార్మికులకు క్లాత్ బ్యాగులను డీపీఓ అందించారు. అనంతరం కార్మికులను సత్కరించారు. పట్టణంలో అంతర్భాగమైన రావికుంటచెరువు, సరిహద్దులను రెవెన్యూఅధికారులు చూపించారని, ఆక్రమణకు గురికాకుండా చెరువును శుభ్రం చేసి, పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపడతామన్నారు. తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఇఓ సుబ్రమణ్యం, వివిధ శాఖలాధికారులు, టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, సర్పంచ్ భర్త నాగేనాయక్ పాల్గొన్నారు.

పెనుకొండ: ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనకు విద్యార్థులు ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలని డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. శనివారం స్థానిక పరిటాల డిగ్రీకళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని శుభ్రంచేసి మొక్కలు నాటి నీరుపోశారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఎన్ఎస్ఎస్ పీఓలు ప్రతాప్, కాంతారావు, యశోదరాణి పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో తడిచెత్త, పొడిచెత్త సేకరించారు. ఎన్ఎస్ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, అధ్యాపకులు శ్రీలేఖ, వలంటీర్లు పాల్గొన్నారు.

మడకశిర టౌన్: ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు అని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. శనివారం పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నర్విహించారు. కమిషనర్ జగన్నాథ్, వైస్‌చైర్‌పర్సన్లు వెంకటలక్ష్మమ్మ, ప్రభావతి, విద్యార్థులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లేపాక్షి: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని ఎంపీడీఓ నరసింహమూర్తి అన్నారు. శనివారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ నాగరాజునాయక్, ఉపాధ్యాయులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం: ప్లాస్టిక్ రహిత సమాజమే ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. శనివారం నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, నవీన్, వెంకటేశ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు


లేపాక్షిలో విద్యార్థుల ర్యాలీ

చంద్రబాబుతోనే సుపరిపాలన


సంతేబిదనూరులో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. సంతేబిదనూరులో ఇంటింటికి తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఇందుకు కారణం వైసీపీ సర్పంచ్ కావడంతో పట్టించుకోలేదన్నారు. వెంటనే స్పందించిన శ్రీనివాసరావు ఎమ్మెల్యే సహకారంతో రూ.50వేలు అందజేశారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, మండల కన్వీనర్ రాము, నాయకులు అరుణాచల్‌రెడ్డి, ఆదినారాయణ, శ్రీరాములు, మంజునాథ్, చిక్కిరప్ప, శివ, సూరీ పాల్గొన్నారు.


చిలమత్తూరులో...

చిలమత్తూరు:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే ప్రజాసమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని పలగలపల్లి పంచాయతీ నేసేవాండ్లపల్లిలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ బయప్ప, సుబ్బరామప్ప, రామచంద్రప్ప, నాగయ్య, విష్ణువర్ధనరెడ్డి, భాస్కరరెడ్డి, మంజునాథ్, బాలాజీ, సురేంద్ర పాల్గొన్నారు.


రొద్దంలో..

రొద్దం: మండలంలోని వివిధ గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలపై స్థానిక నాయకులువివరించారు. శనివారం రొద్దం, శేషాపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు వీరాంజనేయులు, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, చంద్రశేఖర్, అక్బర్, సిద్దన్న, ఉమాశంకర్ పాల్గొన్నారు.


పరిగిలో..

పరిగి: మండలంలోని శాసనకోట గ్రామంలో యూజీ వెంకటేశులు ఆధ్వర్యంలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అబివృద్ధి పనులపై కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. రవీంద్రరెడ్డి, నవీన్, లక్ష్మణ్ణ, ఆదినారాయణ, నరసింహులు పాల్గొన్నారు.


సోమందేపల్లిలో..

సోమందేపల్లి: పట్టణంలోని గీతానగర్, సప్తగిరి కాలనీ, షిర్డీనగర్‌లో శనివారం టీడీపీ నాయకులు ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పథకాలు వివరించారు. పట్టణ ఉపాధ్యక్షుడు ఆకుల రమణ, వడ్డె శివప్ప, అశ్వర్థ, ఉప్పర శంకర, మంజునాథ్, గట్టామహేంద్ర, హేమంత్, రాజేష్, పరంధామ, బాషా, గణ, ఆది, చంద్ర, పూజారిసోము పాల్గొన్నారు.


గుట్టూరులో..

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో టీడీపీ నాయకులు మల్లికార్జున ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. శనివారం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సంక్షేమ పథకాలను వివరించారు. నరేష్‌గౌడ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శివకుమార్(ఫైల్)

అమరాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుదుగూరు గ్రామానికి చెందిన శివకుమార్(28) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. శివకుమార్ బెంగళూరు నగరంలో పనిచేస్తున్నాడు. పనినిమిత్తం స్వగ్రామమైన ఉదుగూరుకు వస్తూ చిరుతహళ్లి అటవీప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్ట్

హిందూపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలుగూరు రైల్వేస్టేషన్ వద్ద 9వ తేదీన నరసింహులు అనే వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో నలుగురిని అరెస్టేచేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపారు. సోమందేపల్లి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తిపై మలుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో చాకుతో హత్య చేసేందుకు యత్నించారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు కేసు దర్యాప్తుచేపట్టి అదే గ్రామానికి చెందిన ఎలవ శ్రీనివాసులు, ఎలవ చిన్న అంజినప్ప, ఎలవ నగేష్, వినయ్‌లను శనివారం హిందూపురం సమీపంలో అదుపులో తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ కేసులో మరొకరు పరారీలో ఉన్నారు. ఒక మహిళతో సన్నిహితంగా ఉండటం చూసి నరసింహులును హత్య చేసేందుకు యత్నించినట్లు విచారణలో తేలిందన్నారు.